క్లుప్తంగా

నాన్ స్పౌజ్ ఉపాధ్యాయులకు న్యాయం చేయండి

అవనిగడ్డ: నాన్ స్పౌజ్ ఉపాధ్యాయులకు జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టి ప్రత్యేక పాయింట్లు కల్పించాలని నాన్ స్పౌజ్ టీచర్స్ ఫెడరేషన్ (ఎన్ఎస్‌టీఎఫ్) నాయకులు ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం బుద్ధ ప్రసాద్‌ను కలుసుకుని వారి సమస్యలు వివరించారు. వీటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. యూనియన్ వ్యవస్థాపకురాలు ఎస్.సుధారాణి, కుమార్, శ్యామ్ ప్రసాద్, కె.సుధారాణి పాల్గొన్నారు.

వీధులను పరిశుభ్రంగా ఉంచుదాం



గూడూరు: వీధుల్లో చెత్తా చెదారం వేయకుండా పరిశుభ్రంగా ఉంచుకుందామని గూడూరు సర్పంచి లింగం సులోచనారాణి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జాతీయ గ్రామపంచాయతీ దినోత్సవం పురస్కరించుకుని గూడూరు పంచాయతీ కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు చెత్త సేకరణ డస్ట్‌బిన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తడి చెత్త పొడి చెత్తను వేర్వేరుగా ఉంచి గ్రీన్ అంబాసిడర్‌లకు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు లింగం విజయ్, అమరారపు సుబ్బారావు, కార్యదర్శి టి.భాస్కరరావు, శివరామ ప్రసాద్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

చెక్కులు అందజేత

అవనిగడ్డ: నియోజకవర్గంలో పలు ప్రాంతాలకు చెందిన 34 మంది లబ్ధిదారులకు రూ.80,86,077 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ గురువారం పంపిణీ చేశారు. అవసరమైన వారిని ఆదుకుంటామన్నారు.

భూముల రీ సర్వేపై గ్రామసభ

కృత్తివెన్ను: భూముల రీ సర్వేకు సంబంధించి ఫేజ్-2 లో భాగంగా లక్ష్మీపురం రెవెన్యూ గ్రామ పరిధిలో గురువారం గ్రామసభ నిర్వహించారు. రైతులు తమ భూములకు సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు సర్వే బృందానికి అందజేసి లోపాలుంటే సరిచేసుకోవచ్చని తెలిపారు. సభలో సర్పంచ్ పులగం సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ సోమేశ్వరరావు, డీటీ శశికుమార్, ఎంఆర్ఐ, మండల సర్వేయర్, రైతులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

గూడూరు: రాయవరంలోని అయ్యప్పస్వామి ఆలయ మొదటి వార్షికోత్సవం పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ ధర్మశాస్త్ర సేవా సమితి ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భారీ అన్నసమారాధన జరిగింది. కార్యక్రమంలో సర్పంచి నందం మల్లీశ్వరి, నందం రవికిరణ్, మాజీ ఎంపీపీ కాసగాని శ్రీనివాసరావు, నారగం వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'ఉరుసు' ప్రారంభం



గూడూరు: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే గూడూరు పటాన్‌పేటలోని హజ్రత్ నిర్గన్ షా ఔలియా దర్గాలో ఉరుసు ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను పురస్కరించుకుని ముస్లింలతో పాటు హిందువులు పెద్ద ఎత్తున తరలివచ్చి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బాబాకు చాదర్‌లు, మొక్కుబడులు సమర్పించారు. ఉత్సవాలలో భాగంగా మొదటి రోజు గురువారం గంధ మహోత్సవం నిర్వహించారు. దర్గా నుంచి ప్రారంభమైన సందల్ ఊరేగింపు పటాన్‌పేట, గూడూరు గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు.

వితంతువులకు పెన్షన్ ఇవ్వడానికి చర్యలు

ఘంటసాల: ఘంటసాల: పెన్షన్ వస్తున్న భర్త చనిపోయిన వారి భార్యలలకు పెన్షన్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ డి.సుబ్బారావు తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 2023 డిసెంబర్ 1 నుంచి 31 అక్టోబర్ 2024 వరకు పెన్షన్ తీసుకుంటూ చనిపోయిన పురుషులు వారి భార్యలకు స్పౌజ్ పెన్షన్‌కు దరఖాస్తులను వెల్ఫేర్ అసిస్టెంట్లు శుక్రవారం సాయంత్రం లోపు లాగిన్‌లో పంపాలని ఆదేశించారు. అర్హులైన వారు ఆధార్ కార్డు, రైస్ కార్డు, మరణ ధ్రువీకరణ పత్రం తీసుకుని సంబంధిత అధికారులను కలవాలని సూచించారు. ఘంటసాల మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో 116 మంది ఉన్నట్లు ఇప్పటి వరకు గుర్తించినట్లు ఎంపీడీవో సుబ్బారావు తెలిపారు.

కుచించుకుపోతున్న కృష్ణా కరకట్ట

- నాగాయలంక కరకట్ట రెండు వైపులా ఆక్రమణలు
- మత్స్య వ్యర్థాలను ఇష్టానుసారం పడేస్తున్న వ్యాపారులు
- చాలా చోట్ల చెత్త డంపింగ్‌తో ఉనికి కోల్పోతున్న వైనం
- పర్యాటక ప్రాంతం నేపథ్యంలో కరకట్ట సుందరీకరణ అవశ్యం



గ్రామం పరిధిలో రెండు వైపులా ఆక్రమణలతో కుచించుకు పోతున్న కృష్ణా కరకట్ట

నాగాయలంక: కృష్ణానది వరదల తాకిడిని తట్టుకునే విధంగా పటిష్టంగా ఉండాల్సిన కరకట్ట నాగాయలంక పరిధిలో నానాటికి కుచించుకుపోవడం ఆందోళన కలిగిస్తోంది. నదీ పరివాహక ప్రాంతాన్ని పరిరక్షించాల్సిన రివర్ కన్జర్వెన్సీ యంత్రాంగం ఏమాత్రం పట్టించుకోకపోవడంతో కరకట్ట వెడల్పు తరిగిపోయింది. ఈ ప్రాంతంలోని వాటర్ స్పోర్ట్స్ అకాడమీ, శ్రీరామపాద క్షేత్రం, నదీపాయల నడుమ నవలంక దీవి ప్రదేశాలను పర్యాటకంగా తీర్చిదిద్దాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామంటున్న జిల్లా అధికార యంత్రాంగం తొలుత గ్రామం పరిధిలో కృష్ణా కరకట్టను సుందరీకరించాల్సిన ఆవశ్యకత గుర్తించాలని గ్రామస్తులు అంటున్నారు. గ్రామంలో 2014 నుంచి దరిదాపు ఏడేళ్ల పాటు స్వచ్ఛ నాగాయలంక సొసైటీ సేవా కార్యకర్తలు కరకట్టపై చేసిన స్వచ్ఛంద శ్రమదాన సేవలు బూడిదలో పోసిన పన్నీరైంది. కోవిడ్‌కు ముందు స్వచ్ఛ సైనికులు అనేక పర్యాయాలు కరకట్టను సుందరంగా తీర్చిదిద్దారు. అనంతర కాలంలో ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోకపోవడంతో నాగాయలంక గ్రామం పశ్చిమ దిక్కునున్న కృష్ణానది కరకట్ట అధ్వాన స్థితికి చేరింది. కరకట్ట కింద గ్రామస్తుల గృహాలు, పలు ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నప్పటికీ ఏమాత్రం ఖాతరు చేయకుండా పీతల వ్యర్థాలను వ్యాపారులు కరకట్టపై వేయడంతో సమీప ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



నాగాయలంక కరకట్టపై పోస్తున్న పీతల వ్యర్థాలు



చెత్తా చెదారం వ్యర్థాల డంపింగ్‌తో ఉనికి కోల్పోతున్న కరకట్ట

ప్రభుత్వ కార్యాలయాలైన ఉపాధి హామీ, వెలుగు, మహిళా సమాఖ్య సముదాయమైన స్త్రీశక్తి భవనం, సచివాలయం-2, రైతు సేవాకేంద్రం ఈ కరకట్ట కిందనే ఉండటం గమనార్హం. గతంలో స్వచ్ఛ సేవా కార్యకర్తలు ఎంతో శ్రమించి ఈ కరకట్టను ప్రజలకు ఉపయోగ పడేలా తీర్చిదిద్దిన విషయాన్ని గ్రామస్తులు గుర్తు చేస్తూ ప్రస్తుతం పీతలు, రొయ్యలు, చేపల వ్యర్థాలను కరకట్టపై పడవేయడాన్ని నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కరకట్టను బాగుచేసే ప్రణాళికకు ఆమోదం



త్వరలోనే నాగాయలంక కరకట్టపై ఆక్రమణలు, అపరిశుభ్ర వాతావరణ పరిస్థితి నుంచి విముక్తి కలిగిస్తాం. సంబంధిత కరకట్ట మొత్తం బాగు చేయించి, కట్టపై ఆక్రమణలు తొలగించేలా చర్యలు చేపడతాం. విద్యుత్ దీప స్తంభాలు వేయడంతో పాటు ఆ ప్రాంతమంతటా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని గత నెల 29న జరిగిన పంచాయతీ సమావేశంలో తీర్మానం ఆమోదించాం.

–జరుగు పవన్‌కుమార్, గ్రామ కార్యదర్శి, నాగాయలంక

ఉగ్రవాదుల చర్య హేయం



బందరులో ఆజాద్ స్తూపం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న సమాఖ్య వేదిక ప్రతినిధులు

బంటుమిల్లి: కశ్మీరులో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడి హేయమని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. హిందూ శోభా యాత్ర సంఘం ఆధ్వర్యాన గురువారం రాత్రి పార్టీలకతీతంగా కాగడాలతో నిరసన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక అంబేడ్కర్ సెంటర్లో నిర్వహించిన మానవహారంలో కాగిత మాట్లాడుతూ పాకిస్తానీ ప్రేరేపిత తీవ్రవాదులు చేసిన దాడిని దేశం యావత్తూ ముక్తకంఠంతో ఖండించిందన్నారు. దేశమంతా ఏకతాటిపై తీవ్రవాదాన్ని ఎదుర్కొని పాకిస్తాన్‌కు తగిన గుణపాఠం చెప్పాల్సిన రోజు వచ్చిందన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల రామాంజనేయులు మాట్లాడుతూ పాకిస్తాన్ అమాయకుల ప్రాణాలను బలిపెడుతోందన్నారు. ఈ దాడిలో మరణించిన 28 మందికి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా వినాయకునిగుడి నుంచి గాంధీ మండపం వరకు కాగడాలు, కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పలు పార్టీల నేతలు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: కశ్మీర్‌లోని పర్యాటక కేంద్రంలో అమాయక పర్యాటకులను కాల్చి చంపిన తీవ్రవాదులను పట్టుకుని కేంద్ర ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని ముస్లిం సమాఖ్య వేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. గురువారం రాత్రి వేదిక ఆధ్వర్యంలో స్థానిక రాజుపేట కొత్తమసీదు సెంటరులోని ఆజాద్ స్తూపం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వేదిక నాయకులు మాట్లాడుతూ అవసరమైతే పాకిస్తాన్‌పై యుద్ధం ప్రకటించాలని సూచించారు. తీవ్రవాదులను పట్టుకునే బాధ్యతలను హిందూ సంస్థలకు అప్పగిస్తే తాము కూడా సహకరిస్తామన్నారు. మతోన్మాదం నశించాలి, తీవ్రవాదం నశించాలంటూ నినాదాలు చేశారు. కొవ్వొత్తుల ప్రదర్శనకు వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు షేక్ సలార్‌దాదా, షేక్ అచ్చెబా, షేక్ మొహమ్మద్‌సాహెబ్, యూనస్, సీపీఎం నాయకులు కొడాలి శర్మ, టి చంద్రపాల్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు అబ్దుల్‌మతీన్ మద్దతు తెలిపారు.

- స్థానిక జనసేన పార్టీ కార్యాలయం నుంచి లక్ష్మీటాకీసు సెంటరు వరకు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు.
- వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. క్లబ్ ఆర్‌సీ వేముల శిరీష ఇంటి నుంచి ప్రారంభించిన కొవ్వొత్తుల ర్యాలీ నగరంలోని ప్రధాన రహదారుల గుండా సాగింది. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు యెండూరి సురేష్, శ్రీకాకుళపు రేణుకారాణి, అన్నం అశోక్, జల్లూరి దివ్య, అనురాధ, రాంబాబు, జయవరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బంటుమిల్లిలో నిరసన ప్రదర్శన



వాసవీక్లబ్ ఆధ్వర్యాన కొవ్వొత్తుల ర్యాలీ



చల్లపల్లి ప్రధాన సెంటర్లో కొవ్వొత్తులతో ఆర్యవైశ్యుల శాంతి ర్యాలీ

చల్లపల్లిలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యాన..

చల్లపల్లి: ఇటీవల పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ ఆర్యవైశ్యం సంఘం ఆధ్వర్యాన గురువారం రాత్రి ప్రధాన రహదారిపై శాంతి ర్యాలీ నిర్వహించారు. దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని, భారత్ మాతాకు జై అంటూ నినాదాలు చేశారు. ప్రధాన సెంటర్లో కొంతసేపు మానవహారంగా ఏర్పడి కొవ్వొతులు వెలిగించి మరణించిన వారికి సంతాపం తెలిపారు.

విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

చల్లపల్లి: విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నామని కన్స్యూమర్ గ్రీవెన్సెస్ రెడ్రెసెల్ ఫోరమ్(సీజీఆర్‌ఎఫ్) చైర్మన్, ఫార్మర్ డిస్ట్రిక్ట్ సేషన్స్ జడ్జి ఎన్.విక్టర్ ఇమ్మానుయేల్ చెప్పారు. ఏపీ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ, విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక విజయవాడ వారి ఆధ్వర్యంలో స్థానిక పెదకళ్లేపల్లి రోడ్డులోని వర్తక సంఘం ఫంక్షన్ హాల్లో గురువారం విద్యుత్ వినియోగదారుల అదాలత్, అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత వినియోగదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. హైఓల్టేజీ, లోఓల్టేజీ, కరెంటు బిల్లులు ఎక్కువ మొత్తంలో రావడం, దెబ్బతిన్న కరెంటు స్తంభాలను మార్చాలని కోరుతూ పలు అర్జీలు వచ్చాయి. తర్వాత ఒక్కొక్కరినీ పిలిచి వారి సమస్యను విని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. అనంతరం సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్ మాట్లాడారు. విద్యుత్ అదాలత్‌ను వినియోగదారులు ఉపయోగించుకోవాలన్నారు.



చల్లపల్లిలో మాట్లాడుతున్న సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్

ఉయ్యూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.కృష్ణ నాయక్ మాట్లాడుతూ ప్రజలు సమస్యలు చెప్పినప్పుడు విద్యుత్ అధికారులు, సిబ్బంది వంకలు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేయకుండా వాటి పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సీజీఆర్‌ఎఫ్ సాంకేతిక సభ్యులు ఎస్.శ్రీనివాసరావు, ఆర్థిక సభ్యులు ఆర్‌సీహెచ్.శ్రీనివాసరావు, స్వతంత్ర సభ్యులు సునీత, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు. విద్యుత్ అధికారులు విక్టర్ ఇమ్మానుయేల్‌ను ఘనంగా సన్మానించారు.

వైఎస్సార్ సీపీ సీనియర్ నేత 'గోళ్ల' మృతి



అవనిగడ్డ: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గోళ్ల నాగేశ్వరరావు(67) హఠాన్మరణం పార్టీకి తీరని లోటని మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. పేర్ని నానితో పాటు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్, సింహాద్రి రమేష్ బాబు, దివి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు, ఇతర నేతలు గోళ్ల నాగేశ్వరరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. నాగేశ్వరరావు నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. విషయం తెలుసుకున్న సుదర్శి మానవత సేవా సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్ నాగేశ్వరరావు భార్య కృష్ణ కుమారి, బావ కడవకొల్లు నరసింహారావు కుటుంబ సభ్యులతో మాట్లాడగా నేత్రదానానికి ముందుకు వచ్చారు. విజయవాడకు చెందిన ఎల్వీ ప్రసాద్ వైద్య బృందం నాగేశ్వరరావు నేత్రాల నుంచి కార్నియాను సేకరించి తీసుకెళ్లారు.

ఉద్యోగుల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధి

జెడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు

మోపిదేవి: గ్రామాభివృద్ధిలో ఉద్యోగులు భాగస్వాములు కావాలని జెడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రావి దుర్గావాణి అధ్యక్షతన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ప్రజాప్రతినిధులు, గ్రామ కార్యదర్శులతో గురువారం సాయంత్రం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రజాప్రతినిధులతో పాటు గ్రామ కార్యదర్శులు కలసి కట్టుగా ముందుకెళ్లాలన్నారు. ఎంపీపీ దుర్గావాణి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా మండలంలోని నిధులు అన్ని పంచాయతీలకు కేటాయిస్తూ అభివృద్ధి చేస్తున్నామని, అవసరమైతే మరిన్ని అందజేస్తామని స్పష్టం చేశారు. అనంతరం సర్పంచ్‌లకు, గ్రామ కార్యదర్శులకు సన్మానం చేశారు. తొలుత ఆయా గ్రామాల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ కార్యదర్శులు పాలకవర్గ సభ్యులతో ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించారు. మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి గ్రామ స్వరాజ్య ప్రాముఖ్యతను చర్చించుకున్నారు. సర్పంచ్‌లు గరికిపాటి వెంకటేశ్వరావు, మోర్ల జ్యోత్స్న, నందిగం మేరీ రాణి, దిడ్ల జానకీ రాంబాబు, అరజా సంధ్యారాణి, మండల కో–ఆప్షన్ సభ్యులు చందన రంగారావు తదితరులు పాల్గొన్నారు.



మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

దళితుల్ని వెలివేస్తే పవన్ స్పందించకపోవడం విచారకరం

దళిత జేఏసీ నాయకుల ధర్నా

మచిలీపట్నంటౌన్: పిఠాపురం నియోజకవర్గంలో దళితులను గ్రామ బహిష్కరణ చేస్తే డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించకపోవడం విచారకరమని దళిత జేఏసీ నేతలు అన్నారు. పిఠాపురం, రాజంపేటలో జరిగిన ఘటనలను ఖండిస్తూ దళిత జాయింట్ యాక్షన్ కమిటీ కృష్ణా జిల్లా శాఖ నాయకుల ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. స్థానిక లక్ష్మీ టాకీస్ సెంటర్ అంబేడ్కర్ సర్కిల్లో దళిత జేఏసీ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నాలో పాల్గొన్న నాయకులు ఈ రెండు ఘటనలకు బాధ్యులైన అగ్రవర్ణాల వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. తొలుత కాశ్మీర్‌లో చోటు చేసుకున్న ఉగ్రవాద దాడికి నిరసనగా, మృతుల ఆత్మలకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. సర్కిల్లో ఉన్న డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలం మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దళిత జేఏసీ జిల్లా అధ్యక్షుడు జక్కుల ఆనందబాబు (జానీ) మాట్లాడుతూ ఎన్నికల ముందు 'మీకు పౌరుషంలేదా.. అంటూ' దళితుల్ని రెచ్చగొట్టే ప్రసంగాలు చేసిన పవన్‌కల్యాణ్ ప్రస్తుతం ముఖం చాటేయటం చూస్తుంటే దళితుల పట్ల ఆయనకు ఉన్న ప్రేమేమిటో అర్థం అవుతోందన్నారు. కార్యక్రమంలో దళిత జేఏసీ జిల్లా కార్యదర్శి బేతపూడి రవి, కార్పొరేటర్లు యండ్రపాటి నాగేశ్వరరావు, మాచవరపు రాంప్రసాద్, ఏకసిరి వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు గూడవల్లి నాగరాజు, కొక్కిలిగడ్డ శరత్ కుమార్, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ గడిదేసి బాలజేసు తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో నిరసన ధర్నా ప్రదర్శన చేస్తున్న దళిత జేఏసీ నాయకులు

ఆడపిల్లలను వారసులుగా భావించాలి

చల్లపల్లి: కొన్నేళ్లుగా విద్యారంగంలో బాలుర కంటే మెరుగైన ఫలితాలు సాధిస్తూ పాఠశాలలకు, కుటుంబాలకు గుర్తింపు గౌరవం పెంచుతున్న ఆడపిల్లలను మగపిల్లలతో సమానంగా కుటుంబ వారసులుగా భావించాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ అన్నారు. పది ఫలితాల్లో మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన చల్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు బత్తుల బ్యూలా పాలవెల్లి(575), జి.శశికళ(574)ను గురువారం సాయంత్రం వారి నివాస గృహాలకు వెళ్లి సురేష్ మిఠాయి బాక్సులు ఇచ్చి శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు బి.నాగలక్ష్మి, కంభం వెంకటేశ్వరరావు, జి.కోటేశ్వరరావు, ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



575 మార్కులు సాధించిన బత్తుల బ్యూల పాలవెల్లిని సత్కరిస్తున్న దృశ్యం

పంచాయతీరాజ్‌శాఖల సేవలు కీలకం



ఘంటసాల మండల పరిషత్ కార్యాలయంలో ..



నివాళులర్పిస్తున్న సర్పంచి పిండి రమాదేవి

ఘంటసాల: గ్రామాభివృద్ధిలో పంచాయతీరాజ్ శాఖ సేవలు కీలమని ఎంపీపీ వేమూరి రజనీకుమారి అన్నారు. ఘంటసాల మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం ఎంపీపీ అధ్యక్షతన గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు ఎంపీపీ వేమూరి రజని కుమారి, ఎంపీడీవో డి.సుబ్బారావు, పాలకవర్గ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ ఎంపీపీలు కుంపటి నాగేంద్రబాబు, మాడెం నాగరాజు, ఈఓపీఆర్డీ కె.వెంకటేశ్వరరావు, మండల పరిషత్ ఏవో కేజే శ్రీనివాస చంద్ పాల్గొన్నారు.

-ఘంటసాల మండలం చిట్టూర్పు, తెలుగురావు పాలెం గ్రామ పంచాయతీల్లో జరిగిన వేడుకలో సర్పంచులు గూడపాటి వెంకటేశ్వరరావు, రాచూరి ప్రసాద్ బాబు, కార్యదర్శులు నెమలకంటి శ్రీలక్ష్మీ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు పరిధిలో..

గూడూరు: పోసినవారిపాలెం, ఆకులమన్నాడు గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచులు పిండి రమాదేవి, మొహమ్మద్ రఫీ.. మహాత్మాగాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, స్థానిక నేతలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



బ్రహ్మానందం(ఫైల్)

పెడన: చెన్నూరు - సింగరాయపాలెం రోడ్డు మార్గంలో ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న ఒక వ్యక్తి మృతి చెందిన ఘటనపై పెడన పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం జున్నూరు గ్రామానికి చెందిన కడియాల బ్రహ్మానందం (50) వరికోతల సమయం నుంచి మినుము పంటల వరకు పరదాలు అద్దెకు ఇస్తూ జీవిస్తుండేవాడు. ఈ క్రమంలో పెడన మండలం చెన్నూరు గ్రామానికి ఆరు నెలల క్రితం వచ్చి పరదాలు అద్దెకు ఇస్తూ నివసిస్తున్నాడు. ఈ నెల 14వ తేదీ రాత్రి 9.30 గంటల ప్రాంతంలో సింగరాయపాలేనికి భోజనం పార్సిల్ చేయించుకుని తిరిగి చెన్నూరుకు ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. రోడ్డు మార్గంలో వాహనం అదుపుతప్పి పడిపోయింది. తలకు బలమైన గాయం కావడంతో అటుగా వెళ్తున్న వారు చెన్నూరులో నివాసం ఉంటున్న వారికి సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన గుడివాడలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న బాధితుడి పరిస్థితి విషమించడంతో గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మరణించాడు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదుపై పెడన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మట్టి అక్రమంగా తోలితే చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

పెడన: మండలంలో అనుమతి లేకుండా మట్టి, బుసక తోలినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పెడన ఇన్‌చార్జి తహసీల్దార్ కె.అనిల్‌కుమార్ స్పష్టం చేశారు. గురువారం నాలుగు ట్రాక్టర్లను పట్టుకుని వాటికి ఫైన్ వేసినట్లు ఆయన తెలిపారు. 'సాక్షి'లో గురువారం 'పంట పొలాల్లో బుసకాసురులు' కథనం ప్రచురితమైందిమే. దీనిపై స్పందించిన ఆయన గురువారం అనుమతుల్లేకుండా బుసక తోలుతున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకుని ఫైన్ వేశారు. ఈ సందర్భంగా వీఆర్వోలను ఆయన హెచ్చరించారు. మండలంలో ఎక్కడా బుసక, మట్టి తరలింపు జరగకుండా చూడాలని, పూర్తి బాధ్యత మీరే వహించాల్సి ఉంటుందన్నారు.

వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఘంటసాల: వేసవి నేపథ్యంలో దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశాలు ఉండటంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఘంటసాల ఎస్ఐ కె.ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఘంటసాల మండల ప్రజలను అప్రమత్తంగా చేసేందుకు పీఎస్ వద్ద ప్రచార ఆటోను ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. అనంతరం ప్రజలకు పలు సూచనలు చేశారు.